# ఈనాడు అల్లూరి సీతారామరాజు



## పాఠశాల యాప్‌లపై ప్రత్యేక దృష్టి



సహపంక్తి భోజనం చేస్తున్న బాలలు

**పాడేరు పట్టణం, న్యూస్‌టుడే:** ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశాల ప్రక్రియ ముగిసినందున పాఠశాల ప్రగతి, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై విద్యాశాఖ దృష్టిసారించింది. ఇకపై ప్రతివారం సర్కార్ బడుల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, విద్యార్థుల హాజరు, టీఎంఎఫ్ (ప్రధానోపాధ్యాయుల ఇన్‌స్పెక్షన్ ఫాం) వంటి వివరాల సేకరణ, ఇతర స్థితిగతులను సమీక్ష చేయాలని విద్యాశాఖాధికారులకు పాఠశాల కమిషనరేట్ దిశానిర్దేశం చేసింది. ఈ మేరకు పాఠశాల కమిషనర్ జిల్లా, మండల విద్యాశాఖాధికారులతో ఇటీవల నిర్వహించిన సమీక్షలో కీలక ఆదేశాలిచ్చారు. ప్రధానంగా హాజరుకు సంబంధించిన వివరాలు యాప్‌లలో ఉదయం 10 గంటల లోపు అప్‌లోడ్ అయ్యేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. వీటిని ఎంఈఓలు పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. దీనికి అనుగుణంగానే ఎండీఎంకు సంబంధించిన వివరాలను భోజనం పూర్తయిన వెంటనే యాప్‌లో క్రోడీకరించాలన్నారు. ఈ యాప్‌ల పనితీరుపై ప్రతి వారాంతంలో కమిషనర్ సమీక్షించనున్నారు.

## మారుమూల గ్రామాలకు మహర్దశ

✦ వైకాపా పాలనలో స్తంభించిన ఎస్సీఏ నిధులు
✦ విడుదల చేసిన కూటమి ప్రభుత్వం.. పనులు వేగవంతం

పాడేరు/పట్టణం, న్యూస్‌టుడే

**మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కనీస సదుపాయాలు కల్పించేందుకు కేంద్రం ఏటా విడుదల చేస్తున్న ఎస్సీఏ(స్పెషల్ సెంట్రల్ అసిస్టెంట్) నిధులు గత వైకాపా ప్రభుత్వం పక్కదారి పట్టించింది. అల్లూరి జిల్లావ్యాప్తంగా మావోయిస్టు ప్రభావిత గ్రామాలన్నీ గత ఐదేళ్లలో అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల వ్యవధి లోనే పాత బకాయిలు విడుదల చేసి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోంది. ఏళ్ల తరబడి మందగించిన పనులన్నీ చకచకా తుది దశకు చేరుకుంటున్నాయి.**

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎస్సీఏ పథకం ద్వారా ఏటా సుమారు రూ.30 కోట్లు విడుదల చేస్తోంది. ఆయా నిధులు గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల ద్వారా తారురోడ్లు, భారీ వంతెనలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక భవనాల నిర్మాణానికి వెచ్చిస్తుంటారు. పాడేరు ఏజెన్సీలో సగానికి పైగా గ్రామాలు మావోయిస్టు ప్రాంతాలుగానే గుర్తించారు. ఈ నిధులతో ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాల్లో వందాలది గ్రామాలకు రోడ్లు, రవాణా సదుపాయాలు కల్పించేలా ప్రతిపాదించారు. వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో ఈ నిధులు సైతం దారి మళ్లించడంతో అభివృద్ధి అటకెక్కింది. ఫలితంగా మారుమూల గ్రామాలకు రోడ్లు, రవాణా సదుపాయాలు మెరుగుపడలేదు. అత్యవసర పరిస్థితుల్లో డోలీ మోతలే దిక్కవుతున్నాయి.



ఎస్సీఏ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం

**2018 నుంచి 2024 వరకు వివరాలిలా..**

- ఎస్సీఏ పనులు మంజూరు: 262
- పూర్తయినవి: 212
- పనులు జరుగుతున్నవి: 42
- ప్రారంభం కానివి: 8
- ఇప్పటివరకూ విడుదలైన నిధులు: రూ.125.74 కోట్లు
- ప్రస్తుతం విడుదలైన నిధులు: రూ.46 కోట్లు
- గిరిజన మ్యూజియానికి: రూ.5 కోట్లు



కిలంకోట పంచాయతీ కోడిమామిడి వద్ద నిర్మించిన భారీ వంతెన

**బకాయిలు విడుదల ..** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.46 కోట్ల మేర ఎస్సీఏ నిధుల బకాయిలు విడుదల చేశారు. రూ.3.1 కోట్ల నిధులతో జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీకి వెళ్లే కోడిమామిడి వద్ద భారీ వంతెన నిర్మించారు. ఈ వంతెన నిర్మాణం ద్వారా ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని వందలాది గ్రామాలకు రోడ్డు, రవాణా సదుపాయం మెరుగుపడుతోంది. గూడెంకొత్తవీధి మండలం కోడాసింగి గ్రామానికి రూ.1.2 కోట్లతో తారురోడ్డు, రూ.90 లక్షలతో జి.మాడుగుల మండలం నుర్మతి పంచాయతీ నక్కమెట్టకు, రూ.70 లక్షలతో చెరుకుంపాకలకు రోడ్లు నిర్మించారు. నిధుల లేమితో లంబసింగిలో నత్తనడకన సాగుతున్న గిరిజన మ్యూజియం నిర్మాణానికి రూ.5 కోట్లు విడుదల చేశారు.

**ఎస్సీఏ పనులు వేగవంతం..** ఇటీవల నిధులు విడుదల కావడంతో ఎస్సీఏ ద్వారా చేపట్టిన పనులు వేగవంతం కానున్నాయి. మారుమూల గ్రామాలకు తారురోడ్లు, భారీ వంతెనలు, సామాజిక, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధుల కేటాయింపు జరుగుతోంది. దీని ద్వారా రోడ్డు, రవాణా సదుపాయాలు మెరుగుపడనున్నాయి. ఆయా గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేందుకు ఆస్కారముంటుంది. – డీవీఆర్ఎం రాజు, ఈఈ, గిరిజన ఇంజినీరింగ్‌శాఖ, అల్లూరి జిల్లా

## చెక్‌డ్యాం మరమ్మతులకు రూ.20 లక్షలు



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న జలవనరుల శాఖ అధికారులు, గ్రామస్థులు

**చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బెన్నవరం పంచాయతీ గచ్చుపల్లి వద్దనున్న చెక్‌డ్యాం కొట్టుకుపోయి శిథిలావస్థకు చేరుకుంది. గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు శ్రమదానంతో దీన్ని బాగు చేసుకున్నారు. చెక్‌డ్యాంపై మేట వేసిన బురద, మట్టిని తొలగించారు. ఈ నెల 27న దీనిపై 'ఈనాడు'లో 'చేయి చేయి కలిపారు.. చెక్‌డ్యాంను బాగు చేసుకున్నారు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనికి చిన్ననీటిపారుదల శాఖ (ఎస్ఎంఐ పాడేరు) అధికారులు స్పందించారు. కొట్టుకుపోయిన చెక్‌డ్యాంను శుక్రవారం పరిశీలించారు. చెక్‌డ్యాం మరమ్మతులకు రూ.20 లక్షల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేశామని, వర్షాలు తగ్గిన తరువాత పనులు మొదలుపెడతామని తెలిపారు. జనసేన నాయకులు బొజ్జన్నదొర, ఉగ్రంగి లక్ష్మణరావు తదితరులు ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

స్పందనకు వందనం

## అంబులెన్సు సేవలకు కాల్‌సెంటర్

**పాడేరు, న్యూస్‌టుడే:** గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అత్యవసర వైద్యసేవలు అందించడానికి ఐటీడీఏ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని 120 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులను సకాలంలో ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్సులు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ల్యాండ్‌లైన్ నంబర్ 08935 251737, చరవాణి నంబర్ 63039 21374లను సంప్రదించాలని సూచించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లు, ఏటీడబ్ల్యూవోలు కాల్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గిరి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని చెప్పారు.




## మ్యూజియానికి ఉత్తమ పురస్కారం



సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న జేసీ అభిషేక్ గౌడ

**పాడేరు, న్యూస్‌టుడే:** అత్యుత్తమ శాస్త్రీయ నిర్వహణ గమ్యం విభాగంలో అరకులోయ గిరిజన మ్యూజియం టూరిజం అవార్డుకు ఎంపికైంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా జేసీ ఎం.జె.అభిషేక్ గౌడ అవార్డు అందుకున్నారు. జిల్లా టూరిజం అధికారి జి.దాస్ పాల్గొన్నారు.

## పర్యటకాభివృద్ధి అందరి బాధ్యత

**పాడేరు, న్యూస్‌టుడే:** దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన పర్యటక ప్రాంతాలు మన జిల్లాలో ఉన్నాయని, వాటి అభివృద్ధికి అందరం బాధ్యత తీసుకోవాలని పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యటక దినోత్సవాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ముస్సోరిలో కంటే మన్యంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని చెప్పారు. పర్యటక అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. డీఆర్ఓ పద్మావతి మాట్లాడుతూ.. సందర్శకులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారిని మరింత ఆకర్షించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


★ స్వదేశీ దర్శన్ 2.0 ప్రాజెక్టులో భాగంగా అరకు- లంబసింగి టూరిస్ట్ డెస్టినేషన్ లోగోను సబ్ కలెక్టర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. లంబసింగి, అరకు ప్రాంతాలు, గిరిజన సంప్రదాయాలు, కాఫీ అడ్వెంచర్ టూరిజం మొదలైన అంశాలు ప్రస్ఫుటించేలా లోగోను రూపొందించిన టూరిజం ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.రతన్‌రాజును పలువురు అభినందించారు. ప్రపంచ పర్యటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు. పర్యటక అభివృద్ధి సంస్థ సభ్యుడు కిల్లు వెంకటరమేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, అనంతగిరి సర్పంచి రమణమ్మ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్, డీఈఓ బ్రహ్మాజీరావు, ఉద్యాన శాఖాధికారి రమేష్‌కుమార్‌రావు, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, కిల్లు రమేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి

## వైకేపీలో వైకాపా మార్క్ దందా

ఈనాడు, పాడేరు, అనకాపల్లి




గత ప్రభుత్వ హయాంలో దొంగ పొదుపు సంఘాలను సృష్టించి బ్యాంకుల నుంచి రూ.కోట్ల రుణాలు వాడేసుకున్నారు. ఇటీవల పిఠాపురంలో వెలుగుచూసిన ఈ అక్రమ రుణాల బాగోతం కూటమి ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఈ తరహా నకిలీ సంఘాల వ్యవహారం మిగతా చోట్ల కూడా ఉన్నాయని గ్రహించింది. రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా రుణాల అక్రమాలపై విచారణ చేయాలని నిర్ణయించింది.

వైకాపా ప్రభుత్వంలో అనకాపల్లిలో పలు బ్యాంకుల నుంచి సుమారు రూ.7 కోట్లకు పైగా పక్కదారి పట్టించారు. గ్రామైక్య సంఘాల లీడర్లే (వీఓఏ) నకిలీ సంఘాల సృష్టికర్తలు. అప్పట్లో వారి అక్రమాలకు నేతలు అండగా నిలవడంతో చర్యలకు మీనమేషాలు లెక్కిస్తూ వచ్చారు. ఎన్నికల ముందు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో వీఓఏలుగా తప్పించారు. వారితో అంటకాగిన ఒక ఏపీఎం, ఇద్దరు సీసీలను సస్పెండ్ చేశారు. ఆరు నెలలకే మరలా వారిని గుట్టుచప్పుడు కాకుండా విధుల్లోకి తీసుకుని అల్లూరి జిల్లాకు పంపించేశారు. కూటమి ప్రభుత్వం మరలా నకిలీ రుణాలపై ఆరాలు తీయడంతో వెలుగు అధికారుల్లో గుబులు రేగుతోంది.

**'వెలుగు' చూడని అక్రమాలెన్నో!**

బ్యాంకు లింకేజీ లోనే కాదు స్త్రీనిధి రుణాలు కూడా పక్కదారి పట్టించారు. వైకాపా నేతలు కొందరు బినామీ పేర్లతో ఈ రుణాలు వాడేసుకున్నారు. దేవరాపల్లి, చోడవరం, గొలుగొండ, పాడేరు మండలాల్లో స్త్రీనిధి, ఉన్నతి రుణాల అక్రమాలు అనేకం చోటుచేసుకున్నాయి. అప్పట్లో స్థానికంగానే గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు ఉండడంతో అక్రమాలు వెలుగుచూస్తే పార్టీకి ఇబ్బందని బయటపెట్టనివ్వలేదు. క్షేత్రస్థాయి సిబ్బందిపై తాత్కాలిక క్రమశిక్షణా చర్యలు తీసుకున్నా, రుణాల తీరును పర్యవేక్షించాల్సిన డీపీఎంలు, ప్రాజెక్టు మేనేజర్‌కు కేవలం తాఖీదులతోనే సరిపెట్టేశారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన రుణాలపై కూటమి సర్కారు ప్రత్యేక ఆడిట్ చేయాలని భావిస్తోంది. దీంతో అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది. బదిలీలపై వెళ్లిపోయినా బాధ్యులపై చర్యలు తప్పవని వెలుగు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

**డ్వాక్రా సంఘాల్లో నకి'లీలలు' ఇవిగో..**

- ✦ గుండాల వీధి గ్రామైక్య సంఘం పరిధిలో 16 నకిలీ సంఘాలు సృష్టించారు. మూడు బ్యాంకుల నుంచి రూ.2.23 కోట్లు పక్కదారి పట్టించారు.
- ✦ గుండాల వీధి-2 గ్రామైక్య సంఘం పరిధిలో 10 నకిలీ సంఘాలు ఏర్పాటు చేశారు. మూడు ప్రైవేటు బ్యాంకుల నుంచి రూ.1.34 కోట్లు రుణాలు తీసుకుని దుర్వినియోగానికి పాల్పడ్డారు.
- ✦ విద్యుత్తు నగర్ గ్రామైక్య సంఘం పరిధిలో రెండు నకిలీ సంఘాలు సృష్టించి రెండు బ్యాంకుల ద్వారా రూ.28 లక్షలు రుణాలు పొందారు.
- ✦ కొత్తూరు, మూలపేట గ్రామైక్య సంఘాల పరిధిలో మరికొన్ని నకిలీ సంఘాలు ఏర్పాటు చేసి రూ.కోట్లలో సొమ్ములు సొంతానికి వాడేసుకున్నట్లు విచారణలో గుర్తించారు.



నకిలీ పొదుపు సంఘాల రుణాలపై విచారణ జరుపుతున్న అధికారులు (పాత చిత్రం)

**టార్గెట్ల కోసం పత్రాలేవీ పరిశీలించకుండానే:** బ్యాంకు లింకేజీలు, స్త్రీనిధి రుణాల విషయంలో వీవోఏలే కీలకంగా పనిచేస్తారు. ఒక బ్యాంకులో రుణాలు తీసుకున్న పొదుపు సంఘాలు మరో బ్యాంకుకు మారేటప్పుడు (మైగ్రేషన్) ఎక్కువ మొత్తంలో అప్పు పొందడానికి అవకాశం ఉంటుంది. ఇదే లోసుగును వీవోఏ ప్రతినిధులు సొమ్ముచేసుకున్నారు. బ్యాంకర్లు కూడా తమ టార్గెట్లు కోసం పత్రాలేవీ పరిశీలించకుండానే రుణాలు ఇచ్చేశారు. ఇలా 40 పైగా నకిలీ సంఘాలతో రూ.7 కోట్లను నాలుగు బ్యాంకుల నుంచి వాడుకున్నారు. సాధారణంగా ఓ పొదుపు సంఘంలో ఆ గ్రామానికి, ఆ ప్రాంతానికి చెందినవారే ఉంటారు. ఈ నకిలీ గ్రూపులను పరిశీలిస్తే వేర్వేరు మండలాలకు చెందిన పది సభ్యులను ఒక గ్రూపుగా సృష్టించి వారి ఫొటోలు, ఆధార్ కార్డులు జతచేసి బ్యాంకులను బురిడీ కొట్టించారు. ఇందులో కొంతమంది సభ్యులు కూడా గ్రామైక్య సంఘం ప్రతినిధులతో లాలూచీ పడి వారి ఖాతాలో పడిన సొమ్ములో కొంత మినహాయించుకుని మిగతా మొత్తాన్ని వీవోఏ అధ్యక్ష, కార్యదర్శుల ఖాతాలకు మళ్లించినవారు ఉన్నారు. చాలామందికి తమ పేరిట రుణాలు వాడినట్లే తెలియదు.. వీటిపై ఫిర్యాదు వచ్చాక విచారణ జరిపి బాధ్యులను గుర్తించి నామమాత్రపు చర్యలకే పరిమితమయ్యారు..

## ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈగా ప్రసాద్



బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్

**పాడేరు, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ అల్లూరి సీతారామరాజు జిల్లా ఆపరేషన్స్ ఎస్.ఈ.గా జి.ఎన్.ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. కొత్త పాడేరులోని ఏపీఈపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గత ప్రభుత్వంలో కొత్త జిల్లాలు ఏర్పడినా సర్కిల్ కార్యాలయాలు నెలకొల్పలేదు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచే జిల్లాలో కార్యకలాపాలు నిర్వహించారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఈపీడీసీఎల్ పరిధిలోని అన్ని జిల్లాలకు సర్కిల్ కార్యాలయాలను మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఉమ్మడి విశాఖ జిల్లా మూడు విభాగాలుగా విడిపోయింది. ఏ జిల్లాకు సంబంధించి ఆ జిల్లా కేంద్రంలోనే సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పాడేరులో ఎస్ఈ కార్యాలయంతో పాటు ఎస్ఈ పోస్టును భర్తీ చేశారు. ఇప్పటివరకు విశాఖపట్నంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రసాద్‌ను అల్లూరి జిల్లాకు బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో విద్యుత్తు సేవలకు అంతరాయం లేకుండా చర్యలు చేపడతామన్నారు. వచ్చే నెల నుంచి ఇక్కడ కార్యకలాపాలు పూర్తిస్థాయిలో సాగించేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎస్ఈని పలువురు ఏఈలు, డీఈలు, లైన్‌మెన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డివిజన్ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు సర్వీసుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏఈలు అప్పారావు, ప్రభాకరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 860 కేజీల గంజాయి పట్టివేత

**ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే:** మన్యంలో గంజాయి నిర్మూలనకు చర్యలు చేపట్టామని, సరకు రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని అదనపు ఎస్పీ ధీరజ్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం ముంచంగిపుట్టులో విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వనుగుమ్మ పంచాయతీలో అసరాడ గ్రామ కూడలి వద్ద ఒక ద్విచక్రవాహనం, బొలెరో వాహనం వస్తుండగా ఎస్సై రవీంద్ర, పోలీసు సిబ్బంది ఆపి తనిఖీ చేశారు. బొలెరో వాహనంపై 43 మూటల్లో తరలిస్తున్న 860 కేజీల గంజాయి దొరికింది. ఇద్దరు నిందితులు పరారవగా.. మాకవరం పంచాయతీలోని కుంబిరిపడ గ్రామానికి చెందిన ఆనందరావు పట్టుబడ్డాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, గంజాయి, వాహనాలు సీజ్ చేశారు. పరారైన నిందితుల కోసం గాలిస్తున్నారు. ఎస్సై రవీంద్ర, సిబ్బందిని అదనపు ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడితో అదనపు ఎస్పీ ధీరజ్, ఎస్సై తదితరులు

## ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**పాడేరు, న్యూస్‌టుడే:** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన, బోధనేతర సిబ్బంది ఉద్యోగాలను పొరుగు సేవల ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక సంవత్సరం కాలానికి పనిచేసేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అర్హులైన, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి. ప్రిన్సిపల్- 3, పీజీటీ- 13, సీఆర్టీ- 20, పార్ట్‌టైమ్- 1. బోధనేతర సిబ్బంది ఖాళీలు ఇలా.. వార్డెన్ -1, అకౌంటెంట్- 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అక్టోబర్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 నుంచి 42 సంవత్సరాలలోపు వయసున్నవారు అర్హులని పేర్కొన్నారు.



## మళ్లీ పెరుగుతున్న వరద



ముంపునకు గురైన గండిపోశమ్మ అమ్మవారి ఆలయం

**దేవీపట్నం, న్యూస్‌టుడే:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటి మట్టం మళ్లీ క్రమంగా పెరుగుతోంది. గండిపోశమ్మ ఆలయం వద్ద శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రానికి సుమారు అడుగు మేర నీటిమట్టం పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. అమ్మవారి ఆలయం చుట్టూ వరద నీరు చేరుతోంది. భక్తులు రాకుండా ఆలయాధికారులు చర్యలు తీసుకున్నారు. సీతపల్లి వాగులో ఉద్ధృతి పెరుగుతోంది. తెల్లవారుజామున వెలగపల్లి వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై కొండ వాగు పొంగింది. దీంతో వెలగపల్లి-రంపచోడవరం మధ్య పది గంటల వరకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లక్ష్మీపురం, గుంపెనపల్లి గ్రామాల గిరిజనులకు సీతపల్లి వాగు కష్టాలు తప్పడం లేదు.

## రహదారి.. మెరుగుపడదా మరి!

మన్యంలో పలు రోడ్లు చిత్తడిగా మారి వాహనదారులు రాకపోకలకు ఇక్కట్లకు గురవుతున్నారు. అరకులోయ నుంచి విశాఖపట్నానికి వెళ్లే మార్గంలో కొత్తభల్లుగుడ వద్ద రహదారి ఛిద్రమైంది. ఎన్‌హెచ్ 516ఈ రహదారి నిర్మాణంలో భాగంగా కొత్తభల్లుగుడ వద్ద పాత రోడ్డును పూర్తిగా తొలగించారు. అక్కడ కొత్తగా పనులు చేపట్టకపోవడంతో వాహనదారులు అవస్థలకు గురవుతున్నారు. సర్వీస్ రహదారిని ఏర్పాటు చేసిన తర్వాతే విస్తరణ పనులు చేపట్టాలి. అందుకు భిన్నంగా గుత్తేదారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. డుంబ్రిగుడ మండలంలో అరకు ప్రధాన రహదారికి ఇరువైపులా కూరగాయల దుకాణాలు పెట్టడంతో వాహనదారులు అవస్థలకు గురవుతున్నారు. అరకు కూడలి నుంచి కొర్రాయి మీదుగా భారీగా ట్రాఫిక్ స్తంభిస్తోంది. కొర్రాయి రహదారిలో కష్టాలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – అరకులోయ, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే



కొత్తభల్లుగుడ వద్ద ఛిద్రమైన రోడ్డు



కొర్రాయి రహదారిలో నిలిచిన వాహనాలు

## 6న రామాయణంపై పోటీలు

**నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే:** తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వచ్చేనెల 6న రామాయణంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు సమితి ప్రతినిధులు తెలిపారు. 9, 10 విద్యార్థులను సీనియర్లుగా, 6, 7, 8 విద్యార్థులను జూనియర్లుగా విభజించి ఈ పోటీలను నిర్వహిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. సీతారామ కల్యాణం, శ్రీరాముని వనవాసానికి కారణాలు, సీతాపహరణ, సీతాన్వేషణ, సేతువు నిర్మాణం, శ్రీరామసుగ్రీవుల మైత్రీ, లంకా దహనం, రామ రావణయుద్ధంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. విశ్వామిత్రుడు, హనుమంతుడు, మారీచుడు, లక్ష్మణుడు, వాలి, భరతుడు, సీత, ఇంద్రజిత్, రావణుడు, కైక పాత్రలపై వక్తృత్వ పోటీలు చేపడతామన్నారు. వచ్చే నెల 6న ఈ పోటీలు నిర్వహించి 10న విజేతలకు నగదు, జ్ఞాపికలను అందిస్తామని సమితి ప్రతినిధులు తెలిపారు.

## అవివాహితులకు సువర్ణావకాశం

**నేడు, రేపు కమ్మ అవివాహిత యువతకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం**

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' కమ్మ అవివాహిత యువత కోసం ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లోని రత్నమాల రెసిడెన్సీలోని 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుంది. వివాహం కోసం ఎదురు చూస్తున్న యువతతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (శనివారం, సెప్టెంబరు 28న), రేపు (ఆదివారం, సెప్టెంబరు 29న) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 91549 18858, 80080 01686 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఫోన్ ద్వారా కూడా ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నెంబర్లకు పంపాలి.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం

# ఎలాగైనా ఇల్లు పూర్తయ్యేలా..

- సహకరించేందుకు కూటమి ప్రభుత్వం చొరవ
- 'మన ఇల్లు.. మన గౌరవం' సదస్సులు నేడు



సొంత స్థలంలో అసంపూర్తిగా ఉన్న ఇల్లు (పాతచిత్రం)

**ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా కూటమి ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుంది. 'మన ఇల్లు.. మన గౌరవం' పేరిట అధికారులను లబ్ధిదారుల వద్దకు పంపి చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఒక్కో అధికారికి రెండు కాలనీల బాధ్యతలను అప్పగించింది.**

చోడవరం, నక్కపల్లి, న్యూస్‌టుడే

పీఎంఏవైలో మంజూరైన ఇళ్ల నిర్మాణానికి అయ్యే వ్యయమంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. వైకాపా ప్రభుత్వం ఈ ఇళ్లకు జగనన్న కాలనీ బోర్డులు తగిలించి తామే ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంది. గతంలో మంజూరైన ఇళ్ల పూర్తికాకపోతే వచ్చే ఏడాది కేంద్రం కొత్తవి మంజూరు చేసేందుకు ఇబ్బందులు ఏర్పడే ఆస్కారముంది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలని ఆదేశించిందని గృహ నిర్మాణ సంస్థ అనకాపల్లి డివిజన్ ఇన్‌ఛార్జి ఈఈ ఎస్‌వీఎస్ శ్రీనివాసరావు చెప్పారు. రూఫ్ లెవల్‌లో ఉన్నవి అక్టోబరు నెలాఖరు, మిగిలినవి 2025 మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యమన్నారు.

**తక్కువ ఖర్చుతో పనయ్యేలా :** ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించడానికి వీలుగా ఇప్పటికే అధికారులు జాబితా సిద్ధం చేశారు. ఏ మండలంలో ఎన్ని ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయనే దానిపై సమగ్ర సమాచారం ఉంచారు. ఇందు కోసం సచివాలయానికి ఓ నోడల్ అధికారితో బృందాన్ని సిద్ధం చేశారు. వీరు లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు ఆపేయడానికి కారణాలను తెలుసుకుంటారు. అందుబాటులో ఉన్న నిర్మాణదారులను తక్కువ ధరకు పనిచేసేలా మాట్లాడటం, తక్కువ ధరకు మెటీరియల్ ఇప్పించడం వంటివి చేస్తారు. మెటీరియల్ తీసుకుని ఇంటి నిర్మాణం చేయని వారితోనూ పనులు మొదలు పెట్టించాలనేది ప్రభుత్వ లక్ష్యం.

**ఇదీ లక్ష్యం**

- పునాది నుంచి లింటెల్ స్థాయిలో ఉన్న ఇళ్లను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలి.
- శ్లాబు స్థాయి/శ్లాబు వేసిన ఇళ్లను ఈ ఏడాది డిసెంబరులోగా పూర్తి చేయడం.

**కట్టుకోకపోతే అన్నివిధాలా నష్టపోతారు..** గతంలో పని మొదలు పెట్టి, వాటిని సంబంధించి త్వరలోనే గడువు ముగియనుంది. ఇలాంటి వారంతా తమకు రావాల్సిన బిల్లులు నష్టపోతారు. భవిష్యత్తులో ఈ నిధులురావు. కొత్త పథకాల్లో అర్హత ఉండదు. పరిణామంగా లబ్ధిదారులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం మన ఇల్లు మన గౌరవం పేరిట లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పుడు ప్రారంభించిన ఇళ్లన్నీ మార్చిలోగా పూర్తిచేయించడమే ముందున్న లక్ష్యం. – నిజ, ఈఈ, నర్సీపట్నం డివిజన్, గృహనిర్మాణ సంస్థ

| నియోజకవర్గం | మంజూరు | పూర్తి |
|---|---|---|
| అనకాపల్లి | 10,718 | 4,408 |
| చోడవరం | 6,710 | 3,308 |
| మాడుగుల | 8,023 | 2,858 |
| నర్సీపట్నం | 7,951 | 3,534 |
| పాయకరావుపేట | 11,879 | 4,220 |
| పెందుర్తి | 3,025 | 1,594 |
| ఎలమంచిలి | 6,636 | 3,371 |
| మొత్తం → | 54,942 | 23,293 |

| జిల్లాలో ఇళ్ల నిర్మాణం ఇలా.. | మంజూరైన ఇళ్లు: 54,924 | మొదలు కానివి: 13,255 | నిర్మాణం మొదలై, వివిధ స్థాయిల్లో నిలిచినవి: 18,108 |
|---|---|---|---|

## విలువల జోడింపుతో ఆర్థిక లబ్ధి




సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**పాడేరు, న్యూస్‌టుడే:** ముడి వస్తువులకు విలువల జోడింపు ద్వారా నాణ్యత పెరగడమే కాకుండా మెరుగైన ఆర్థిక లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం దిల్లీలో దిపార్క్ హోటల్‌లో స్పైసెస్ బోర్డు, ఐకరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్‌కు కలెక్టర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. సుగంధ ద్రవ్యాలైన మిరియాలను సరైన పక్వ స్థితిలో సేకరించాలని, వీటికి అదనపు విలువలు జోడించాలని సూచించారు. రైతులు దళారులపై ఆధారపడొద్దని సూచించారు. అల్లూరి జిల్లాలో రూ.కోట్ల విలువైన మిరియాల వ్యాపారం జరుగుతున్నందున స్పైసెస్ బోర్డు ద్వారా మద్దతు ధర అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రాంతీయ కార్యాలయం ప్రారంభించాలని కోరారు. స్విట్జర్లాండ్ వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఎకనామిక్ అఫైర్స్ అధికారి పాబ్లో జెన్కిన్స్, స్పైసెస్‌బోర్డ్ రీసెర్చ్, ఫైనాన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎ.బి.రేమాశ్రీ, అల్లూరి జిల్లా స్పైసెస్ బోర్డు సీనియర్ క్షేత్రాధికారి బి.కల్యాణి, రైతులు డిప్పల దేవి, కె.రాజారత్నం, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని మృతిపై విచారణ

**అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే:** టోకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని మృతిపై అరకులోయ ఇన్‌ఛార్జి జడ్జి, చోడవరం కోర్టు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ శుక్రవారం రాత్రి విచారణ జరిపారు. పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని సుకురు అప్పలకొండ (12) జ్వరం అనారోగ్యంతో మృతి చెందింది. హైకోర్టు ఆదేశాల మేరకు జ్యుడీషియల్ విచారణ జరిపారు. పాఠశాలలో ఆరోగ్య రిజిస్టర్లు, వసతిగృహం, మరుగుదొడ్లు పరిశీలించారు. ఏఎస్‌ఐ వెంకటరావు, ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి, డిప్యూటీ వార్డెన్ శైలజా కుమారి, సర్పంచి మోస్యా, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి స్వర్ణ

## గడువులోపు ఇళ్ల నిర్మాణం పూర్తి

**రాజవొమ్మంగి, న్యూస్‌టుడే:** పీఎంఏవై గ్రామీణ్‌లో భాగంగా మంజూరై వివిధ దశల్లో ఉన్న ఇళ్లను గడువులోగా పూర్తి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి జాన్‌రాజు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వరరావుతో కలిసి గృహనిర్మాణ సంస్థ, ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌రాజు మాట్లాడుతూ ఈ పథకంలో 2016-17 నుంచి 2021-22 వరకు మంజూరైన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటన్నింటిని వచ్చే ఏడాది మార్చి 31కి పూర్తిచేయాలన్నారు. ఏఈ కె.వెంకట్రాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ★ సంక్షేమ వసతి గృహాల్లో, పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందజేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి జాన్‌రాజు అన్నారు. రాజవొమ్మంగిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. జడ్డంగి పీహెచ్‌సీని తనిఖీచేసి రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

## అంటువ్యాధులపై అప్రమత్తం



చంద్రంపాలెంలో అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పుల్లయ్య



గాంధీనగర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యాధికారి శశికాంత్

**ఎటపాక, న్యూస్‌టుడే:** మండలంలోని చంద్రపాలెంలో శుక్రవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పుల్లయ్య డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అంటువ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద ఉన్న ఖాళీ కొబ్బరి బొండాలు, పాతటైర్లు, నీటి నిల్వచేసిన పాత్రలను పరిశీలించి నీటిని తొలగించాలని సూచించారు. నీరు నిల్వ ఉండే లార్వా ఏర్పడి దోమలు పెరుగుతాయని తెలిపారు. గ్రామంలోని పీహెచ్‌సీలో విజిట్ రికార్డులు తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

**జి.మాడుగుల, న్యూస్‌టుడే:** విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారి శశికాంత్ అన్నారు. జి.మాడుగుల మండల కేంద్రంలోని ఏకలవ్య, గాంధీనగర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. 12 మంది జ్వర బాధితులకు పరీక్షలు చేసి.. ఎవరికీ మలేరియా లేదని తేల్చారు. మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య విస్తరణాధికారి ప్రకాష్, ఆరోగ్య సహాయకుడు జ్యోతిలాల్, ఏఎన్ఎంలు, మార్తమ్మ, చిన్నతల్లి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు

**కశింకోట, న్యూస్‌టుడే:** కస్తూర్బా విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లనున్నామని జిల్లా నోబెల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.వి.రమణ, ఎస్.శ్రీను బాబు తెలిపారు. తేగాడలో శుక్రవారం సమావేశమయ్యారు. మినిమం టైంస్కేల్ అమలు చేయాలని, కంప్యూటర్ టీచర్ల జీతాలు పెంచాలని తదితర డిమాండ్లతో ప్రభుత్వానికి విన్నవించనున్నట్లు తెలిపారు.

## మావోయిస్టులకు వ్యతిరేకంగా సంతలో ప్రచార ర్యాలీ

**చింతూరు, న్యూస్‌టుడే:** మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో శుక్రవారం నిర్వహించిన వారపు సంతలో ఆదివాసీలు పాల్గొని మావోయిస్టులకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి చేపట్టకుండా మావోయిస్టులు అడ్డుకుంటున్నారని, ప్రతీ నెలలో ఏదో పేరుతో వారోత్సవాలు జరుపుతుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన హంతక మావోయిస్టులను కఠినంగా శిక్షించాలంటూ, గిరిజన ద్రోహులు మావోయిస్టులు అని ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు.




ఏడుగురాళ్లపల్లి సంతలో ఆదివాసీల ర్యాలీ

## బాధిత విద్యార్థులకు ఆర్థికసాయం

**చింతపల్లి, న్యూస్‌టుడే:** కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఇటీవల కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం తరపున శుక్రవారం తహసీల్దారు రామకృష్ణ ఆర్థిక సాయం అందించారు. బాధిత విద్యార్థుల్లో 16 మంది చింతపల్లి మండలానికి చెందినవారు ఉన్నారు. వీరంతా ఆసుపత్రిలో కొద్దిరోజుల చికిత్స అనంతరం కోలుకున్నారు. ప్రస్తుతం స్వగ్రామాల్లో ఉంటున్న వీరందరినీ శుక్రవారం లంబసింగి రప్పించారు. ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున మొత్తం రూ.80 వేల నగదును విద్యార్థుల కుటుంబాలకు అందజేసినట్లు తహసీల్దారు తెలిపారు. వీఆర్వోలు నాగరత్నం, పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు, సత్యవాణి, వరప్రసాద్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న తహసీల్దారు రామకృష్ణ

## కఠోర శ్రమతో లక్ష్య సాధన

**చింతపల్లి, న్యూస్‌టుడే:** యువత గంజాయి, మద్యం, ధూమపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని చింతపల్లి ఎస్సై అరుణ్‌కిరణ్ అన్నారు. గురువారం చింతపల్లి ఏపీ గురుకుల బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థి దశ నుంచే మంచి లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే వరకూ శ్రమించాలని ఎస్సై అన్నారు. సీఐ రమేశ్, ప్రిన్సిపల్ రామేశ్వరం, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై అరుణ్‌కిరణ్

## రాజారామ్మోహన్‌రాయ్‌కు నివాళి



నివాళులు అర్పిస్తున్న అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల సిబ్బంది

**అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే:** సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త రాజారామ్మోహన్‌రాయ్ అని అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చలపతిరావు అన్నారు. కళాశాలలో పర్యటక దినోత్సవం, రాజారామ్మోహన్‌రాయ్ వర్ధంతి కార్యక్రమాలను చరిత్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. స్త్రీ అభ్యుదయానికి రాజారామ్మోహన్‌రాయ్ చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. పర్యటక అభివృద్ధితో ఉపాధి, ఆదాయ మార్గాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భరత్‌కుమార్‌నాయక్ హాజరయ్యారు. చరిత్ర అధ్యాపకురాలు లాలికుమారి, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖహాజరు నమోదు తప్పనిసరి

**చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయులు తప్పనిసరిగా రోజూ ముఖ హాజరు నమోదు చేయాలని మండల విద్యాశాఖ అధికారి పనసల ప్రసాద్ అన్నారు. శుక్రవారం చౌడుపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. పాఠశాలల్లో డ్రాపవుట్స్ లేకుండా చూడాలని పేర్కొన్నారు. నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు కుడుముల కాంతారావు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చౌడుపల్లిలో పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాద్

## థియేటర్ సిబ్బందిపై దాడి

**అచ్యుతాపురం, న్యూస్‌టుడే:** దేవర బెనిఫిట్ షో టికెట్లు ఇవ్వలేదనే కారణంతో థియేటర్ సిబ్బందిపై దాడిచేసిన సంఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. దీనిపై థియేటర్ మేనేజర్ కొండబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూడిమడకకు చెందిన ఇద్దరు యువకులు బెనిఫిట్ షో చూడడానికి గురువారం అర్ధరాత్రి అచ్యుతాపురం సెజ్‌లో రోడ్డులోని సినిమాహాల్‌కు వచ్చారు. పూడిమడక మత్స్యకారులకు అప్పటికే ఒక స్క్రీన్ టికెట్లు పూర్తిగా పంపిణీ చేసేశారు. మరో స్క్రీన్‌లో టికెట్లు పొందాలని ప్రయత్నించినా వీలుకాకపోవడంతో ఆగ్రహంతో గేటుదూకి ఆపరేటర్ రవికుమార్, రక్షణ సిబ్బంది జి.ఈశ్వరరావులపై దాడిచేశారు. ఈ దాడిలో ఇద్దరూ గాయపడడంతో అచ్యుతాపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. భారీగా అభిమానులు థియేటర్ వద్దకు రావడం, వీరిని నిలువరించడానికి పోలీసులు లేకపోవడంతో ఈ సంఘటన జరిగిందిన స్థానికులు తెలిపారు. పూడిమడకకు చెందిన ఒక నాయకుడే ఈ విధంగా దాడి చేయించారని మేనేజర్ కొండబాబు ఆరోపించారు.

## రాష్ట్రస్థాయికి కొత్తవీధి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

**దేవీపట్నం, న్యూస్‌టుడే:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలలో తమ పాఠశాల విద్యార్థులు ఆరుగురు రాష్ట్ర, జిల్లా స్థాయికి ఎంపికయ్యారని కొత్తవీధి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శేఖర్‌బాబు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో ఈనెల 18న కాకినాడలో నిర్వహించిన కుస్తీ పోటీలలో ఎం.పొలుదొర, వై.తరుణ్‌లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈనెల 19న రంపచోడవరంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో ఎస్.రాజారెడ్డి, కె.రామకృష్ణ, కె.గౌతమ్, వై.తరుణ్‌లు అథ్లెటిక్స్, చదరంగం, ఖోఖో, కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి కె.బాలుదొర, పాఠశాల ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

## వరద పరిహారం సర్వేపై నిరసన

**వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే:** వరద పరిహారం సర్వే సక్రమంగా జరగలేదంటూ వడ్డిగూడెం గ్రామస్థులు రెవెన్యూ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసనకు దిగారు. వరదలకు గ్రామంలో మునిగిపోయిన ఇళ్లను వదిలేసి, అసలు మునగని ఇళ్లను ముంపు జాబితాలో చేర్చారని సీపీఐ మండల నాయకులు కర్నాటి ఏసు ఇన్‌ఛార్జి తహసీల్దార్ సుబ్బారావుకు ఫిర్యాదు చేశారు. ఈ సర్వే జాబితాపై క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని, నిరసనకారులు అధికారులకు వినతిపత్రం అందించారు. పరిశీలించి, న్యాయం చేస్తానని తహసీల్దార్ చెప్పడంతో ఆందోళన విరమించారు.



తహసీల్దార్‌కు సమస్య వివరిస్తున్న వడ్డిగూడెం గ్రామస్థులు

## ఏకలవ్యలో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**రంపచోడవరం, న్యూస్‌టుడే:** రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆంగ్ల మాధ్యమంలో సీబీఎస్ఈ సిలబస్‌ను బోధించేందుకు అతిథి ఉపాధ్యాయులుగా చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం కోరారు. తెలుగు-3, హిందీ-1, బయాలజీ-3, ఫిజిక్స్-2 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అతిథి టీచర్లుగా రిటైర్డ్ టీచర్స్ లేదా ఆయా సబ్జెక్టులలో విద్యార్హతలు కలిగి ఉన్న అభ్యర్థులు ఈ నెల 29నుంచి అక్టోబర్ అయిదో తేదీ తేదీలోగ దరఖాస్తులను చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలను స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఉన్న గురుకులం సెల్‌ను లేదా ఏకలవ్య స్కూల్స్‌ను సంప్రదించవచ్చున్నారు.

## జలవనరులశాఖ డీఈఈగా జనార్దన్

**పాడేరు, న్యూస్‌టుడే:** జలవనరులశాఖ ఎస్ఎంఐ అరకు సబ్ డివిజన్ డీఈఈగా జనార్దన్ సింకి నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన చీపురపల్లి, బొబ్బిలి ఎస్ఎంఐ సబ్‌డివిజన్ డీఈఈగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడ వస్తున్నారు.

## ఎక్సైజ్ డీసీ బాధ్యతల స్వీకరణ

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** ఉమ్మడి విశాఖ జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా డి.శ్రీరామ చంద్రమూర్తి శుక్రవారం విశాఖలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకు సెబ్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు.



# సర్కారు సాయంపైనే ఆశలన్నీ..!

**గోవాడ సుగర్స్ మహాజన సభ నేడు**




మహాజన సభ స్వాగత ద్వారం

చోడవరం, న్యూస్‌టుడే

**గోవాడ చక్కెర కర్మాగారాన్ని ఆదుకుని అండగా నిలుస్తుందని కూటమి సర్కారుపైనే చెరకు రైతులు, కార్మికులు గంపెడాశలు పెట్టుకున్నారు. టన్నుకు రూ.3,500 చొప్పున చెల్లిస్తామని, ఉప ఉత్పత్తుల తయారీతో గాడిలో పెడతామంటూ ఎన్నికల ప్రచారంలో నాయకులు హామీలిచ్చారు. అనుకున్నట్లే కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. శనివారం జరగనున్న మహాజన సభలో ప్రజాప్రతినిధులు చేసే ప్రకటన అందరికీ తీపిని పంచుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.**

ప్రస్తుత గానుగాట కాలానికి చెరకు రైతులకు టన్నుకు రూ.3,151 చొప్పున కర్మాగారం యాజమాన్యం చెల్లించనుంది. ఈ ఏడాది 1.5 లక్షల టన్నుల చెరకును గానుగాట చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కూటమి నాయకులు చెప్పినట్లు టన్నుకు రూ.3,500 చొప్పున చెల్లించాలంటే అదనంగా రూ.ఐదు కోట్లు అవసరమవుతాయి. చెరకు సరఫరా చేసిన రైతులకు 15 రోజుల్లో వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయాలి. ఇప్పటివరకు మొదటి విడతగా టన్నుకు రూ.2,500 చొప్పున చెల్లిస్తున్నారు. టన్నుకు రూ.3 వేల చొప్పున మొదటి విడతగా జమ చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై మహాజన సభలో ప్రకటన చేస్తారని అన్నదాతలు ఆశపడుతున్నారు.

### తగ్గుతున్న సాగు విస్తీర్ణం

గోవాడ కర్మాగారానికి చెరకు సరఫరా చేయడమంటే రైతులు గౌరవంగా భావించేవారు. కర్మాగారం పరిధిలో 24,231 మంది రైతులున్నారు. వీరిలో ఏటా 2500 మంది చెరకు సరఫరాకు విముఖత చూపుతున్నారు. ముగిసిన గానుగాట కాలానికి 14,301 మంది రైతులే సరఫరా చేశారు. గతంలో 30 వేల నుంచి 41 వేల ఎకరాల్లో చెరకు సాగయ్యేది. ఆరు లక్షల నుంచి 8 లక్షల టన్నుల వరకు దిగుబడి వచ్చేది. సకాలంలో చెల్లింపులు చేయకపోవడం, ధర గిట్టుబాటుకాక రైతులు సాగుకు దూరమవుతూ వస్తున్నారు. 2024-25 గానుగాట కాలానికి పది వేల ఎకరాల్లోనే చెరకు సాగవుతోందని అధికారులు చెబుతున్నారు. 1.7 లక్షల టన్నుల దిగుబడి వస్తే.. అందులో 1.3 లక్షల టన్నులే గానుగాటకు వస్తుందని, మరో 20 వేల టన్నులు సభ్యత్వం లేని రైతుల నుంచి సేకరించాలని యోచిస్తున్నారు.

### రూ.87.78 కోట్ల నష్టం

కర్మాగారం ఏటా నష్టాలనే చవిచూస్తోంది. 2022-23 గానుగాట కాలంలో రూ.16.54 కోట్ల నష్టం వచ్చింది. 2023-24 ఆడిట్ నివేదిక రావాల్సి ఉంది. సంచిత నష్టం (ఎక్యుములేటెడ్ లాస్) రూ.87.78 కోట్లకు చేరింది. ఆప్కాబ్ రుణం, వడ్డీ భారాలు వీటికి అదనం. ఆర్థిక సంక్షోభం నుంచి కాస్తయినా ఉపశమనం లభించాలంటే ఇథనాల్, డిస్టలరీ యూనిట్ల ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. ప్రభుత్వం ఆర్థికంగా చేయూత అందిస్తే తప్ప కర్మాగారం మనుగడ కష్టమని ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

## దశమి వేడుకలకు ముహూర్తపు రాట



దుర్గమ్మ ఆలయం వద్ద దశమి నవరాత్రులకు అంకురార్పణ చేస్తున్న మహిళలు

**మారేడుమిల్లి, న్యూస్‌టుడే:** మారేడుమిల్లిలోని సోమిరెడ్డి పాలెం మాతృశ్రీ వనదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారి నవరాత్రి వేడుకలకు శుక్రవారం ముహూర్తపు రాట వేశారు. మహిళలు పసుపు దంచే కార్యక్రమాన్ని చేపట్టారు. నవరాత్రి వేడుకలకు సంబంధించిన పనులను ప్రారంభించినట్లు ఆలయ ధర్మకర్త టేకుమూడి సత్యనారాయణ తెలిపారు.

## కేజీహెచ్‌కు విద్యార్థి తరలింపు

**పాడేరు, న్యూస్‌టుడే:** స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న వంతాల సందీప్ శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. విద్యార్థిని హుటాహుటిన పాడేరు జిల్లా ఆసుపత్రికి పాఠశాల సిబ్బంది తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి గతంలో పొత్తికడుపు వద్ద శస్త్రచికిత్స జరిగిన ప్రాంతంలో ఇన్ఫెక్షన్‌తో విద్యార్థికి తీవ్ర నొప్పి వస్తోందని గుర్తించి మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించాలని వార్డెన్‌కు సూచించారు. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించి వెంటనే రప్పించారు. కేజీహెచ్‌కు వెళ్లేందుకు విద్యార్థి తండ్రి నిరాకరించారు. ఐటీడీఏ పీఓ అభిషేక్, ఇన్‌ఛార్జి డీడీ రజని, పాఠశాల వార్డెన్ ఎంత చెప్పినా ఆయన నిరాకరించి ఆసుపత్రి నుంచి విద్యార్థిని విడిచిపెట్టి వెళ్లిపోయాడు. దీంతో పాఠశాల ఉపాధ్యాయుడు సహాయంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం విద్యార్థి కోలుకుంటున్నారని చెప్పారు.



విద్యార్థిని సందీప్‌ను కేజీహెచ్‌కు తరలించేందుకు సిద్ధమైన ఉపాధ్యాయులు

## జాతీయస్థాయి ఖోఖో పోటీలకు పేట విద్యార్థులు

**పాయకరావుపేట, న్యూస్‌టుడే:** జాతీయస్థాయి ఖోఖో పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. సీబీఎస్ఈ బోర్డు ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు తెలంగాణాలోని బచ్చుపల్లిలో క్లస్టర్-7 ఖోఖో పోటీలు నిర్వహించింది. అండర్-14 విభాగంలో లాలం పూర్ణశ్యామ్ బృందం, అండర్-19 విభాగంలో జి.ధనుష్ బృందం ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించాయి. వచ్చే నెల 16 నుంచి 19వరకు దేవాస్ (మధ్యప్రదేశ్)లో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. బాలికల అండర్-14 విభాగంలో జి.కావ్యసుధ బృందం తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. విద్యార్థులను శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత సీహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, అభినందించారు.

### చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 107 | 98 |
| లైవ్ | 129 | 118 |
| డ్రెస్‌డ్ | 187 | 206 |
| స్కిన్‌లెస్ | 213 | 216 |

## నిధుల్లేక.. నిర్మాణాలు పూర్తవ్వక!

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం నాడు- నేడుతో పాఠశాలలను కార్పొరేట్ బడుల మాదిరి మార్చేస్తున్నామని గొప్పలు చెప్పింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. పెదబయలు మండలం రూడకోట గిరిజన సంక్షేమ పాఠశాలలో సుమారు 218 మంది విద్యార్థులు ఉన్నారు. 1989లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఇక్కడ వసతిగృహాన్ని నిర్మించింది. అది ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. గత ప్రభుత్వంలో స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులు రూ. 68 లక్షలతో వసతిగృహ నిర్మాణ పనులు ప్రారంభించారు. సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. విద్యార్థులు చాలీచాలని గదుల్లో ఇబ్బందులు పడుతున్నారు. భోజనశాల లేక తరగతి గదుల్లో భోజనం చేయాల్సిన పరిస్థితి. తరగతి గదుల్లోనే నిద్ర పోతున్నారు. బొంరాపల్లి గిరిజన సంక్షేమ పాఠశాలలోనూ వసతిసమస్య వేధిస్తోంది. ఈ పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వసతిగృహాల పనులు పూర్తిచేయాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.


రూఢకోటలో అసంపూర్తిగా వసతిగృహ నిర్మాణం

## రక్షిత జలం.. అందనంత దూరం

రంపచోడవరం, న్యూస్‌టుడే

రంపచోడవరంలో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో 13 ఏళ్ల క్రితం అప్పటి ఎంపీ జి.రత్నాబాయి రూ. 10 లక్షలతో సురక్షిత తాగునీటి (మినరల్ వాటర్) ప్లాంటును ఏర్పాటు చేశారు. గ్రామీణ నీటిసరఫరాల శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వాటర్ ప్లాంట్ స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేశారు. దీనిద్వారా 20 లీటర్ల మినరల్ వాటర్‌ను కేవలం రూ.ఐదుకే అందించేవారు. మూడేళ్ల క్రితం రక్షిత తాగునీటి ప్లాంట్ మరమ్మతులకు గురైంది. దీంతో మూతపడింది. దీంతో సురక్షితమైన తాగునీటికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా తమ గోడును పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రవీంద్రబాబు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ప్లాంట్ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరు కాగానే బాగు చేస్తామన్నారు.


రంపచోడవరంలో మూడేళ్లుగా మరమ్మతులు చేపట్టని తాగునీటి ప్లాంట్

## అమ్మో.. అంగన్‌వాడీ భవనం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

దారెల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాలకు నీరుకారుతోంది. భవనం శ్లాబుపై మొక్కలు పెరిగాయి. గోడలు బీటలు వారి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. దారెల గ్రామంలో పీవీటీజీ, అంగన్‌వాడీ నిర్వహణకు సంయుక్తంగా భవనం నిర్మించి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆ భవనంలో నిర్వహిస్తున్నారు. శిథిలమైన భవనాన్ని గ్రామం మధ్యలో వదిలేశారు. దీనికి మరమ్మతులు చేసి సామాజిక భవనంగా మార్చివేస్తే గ్రామస్థులకు ఉపయోగపడుతుందని స్థానికులు కోరుతున్నారు.


దారెలలో శిథిలావస్థకు చేరిన భవనం


భవనం స్లాబుపై పెరిగిన మొక్కలు

## అవీ ఇవీ

### ముంపు గ్రామాల అభివృద్ధికి నిధులివ్వాలి

కూనవరం, న్యూస్‌టుడే: పోలవరం ముంపు గ్రామాలను ఖాళీచేసే వరకు ఆయా గ్రామాలకు అభివృద్ధి పనులు ఆపకుండా నిధులు కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య కోరారు. కూటూరులో నిర్వహించిన గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడుతూ పోలవరం ముంపు భూములకు వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సాగునీటి వసతులు కల్పించాలన్నారు. పార్టీ జెండాను ఎగురవేసి సీతారామయ్య నివాళులు అర్పించారు. మేకల నాగేశ్వరరావు, సత్యనారాయణ, బొర్రయ్య, శ్రీరాములు, సూరిబాబు, రాజయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మండల కార్యదర్శి సీతారామయ్య

### ఉద్యానంలో బెంచీల ఏర్పాటు

హుకుంపేట, న్యూస్‌టుడే: తడిగిరి పంచాయతీ కంబిడిమామిడి గ్రామంలోని అంబేడ్కర్ పార్కులో శుక్రవారం బెంచీలు ప్రారంభించారు. సర్పంచి రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ టీఎస్ఆర్ ఛారిటబుల్ సంస్థ ఛైర్మన్ సురేష్‌కుమార్ సహకారంతో వీటిని ఏర్పాటు చేశారు. వైకాపా నాయకులు విశ్వేశ్వరరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

### కళాశాలలో తనిఖీలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: కాకరపాడు గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలను టాస్క్‌ఫోర్స్ అధికారి కె.సురేష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, వంట గదిని పరిశీలించారు. మెనూ అమలు తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ ఎస్. జగన్నాథరావు పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కొయ్యూరు, న్యూస్‌టుడే: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఎ.కన్నారావు, వి.తలుపులు, మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన ఎస్.శకుంతలను శుక్రవారం కొమ్మిక స్కూల్ కాంప్లెక్స్‌లో సన్మానించారు. ఎంఈవో రాంబాబు, స్థానిక హెచ్ఎం సంధ్య, పీఆర్‌టీయూ అధ్యక్షుడు నారాయణరావు, ఏపీటీఎఫ్ మండల కార్యదర్శి జి.సత్యనారాయణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో రాంబాబు తదితరులు

### విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు 300 మందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గీతాకృష్ణ, రాజు, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

### పాఠశాలలో క్షుద్రపూజల కలకలం!

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: ఏఎల్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి క్షుద్ర పూజలు జరిగాయన్న వదంతి స్థానికంగా కలకలం రేపింది. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులకు ఆవరణలో ముగ్గు, నిమ్మకాయలు కనిపించడంతో భయపడ్డారు. ఉపాధ్యాయుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి పరిశీలించారు. విద్యార్థులను భయపెట్టేందుకు ఆకతాయిలు ముగ్గు వేసి నిమ్మకాయలు పెట్టి ఉంటారని, భయపడాల్సిందేమీ లేదని ఉపాధ్యాయులు, పోలీసులు చెప్పడంతో అందరూ వెనుదిరిగారు.

## పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామని ఐటీడీఏ పీఓ అభిషేక్ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా అరకులోయ గిరిజన మ్యూజియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక థింసా కళాకారులు, విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. అంతకు ముందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు వేణుగోపాలరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భరత్‌కుమార్‌నాయక్, ఎన్ఎస్ఎస్ పీఓలు నాగమణి, విజయలక్ష్మి, అనితకుమారి, మ్యూజియం క్యూరేటర్ మురళి, పర్యాటక ఉద్యోగ మేనేజరు బొంజుబాబు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: అటవీ ప్రాంతాలను సంరక్షించడం ద్వారా, పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తేనే మానవ మనుగడ సాధ్యమని ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.జయంతి అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మారేడుమిల్లిలో ర్యాలీ చేపట్టారు. గిరిజన గ్రామాల్లోనూ పర్యాటక రంగాన్ని ప్రోత్సాహించడం ద్వారా అభివృద్ధి చెందే ఆస్కారం ఏర్పడుతుందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ బాలాజీ, హెచ్ఎం ఎం.రామారావు దొర, ఆరోవ్ యేసు బాబు, పీడీ సుదర్శన్ పాల్గొన్నారు.

చింతూరు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం, చరిత్ర విభాగం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- 2047 విజన్‌పై అవగాహన సదస్సుతో పాటు ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపల్ డా. కె.రత్నమాణిక్యం మనుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్ది పర్యాటక రంగంలో మొదటిస్థానంలో నిలపాలని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ మణి శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జి.సాయికుమార్, అధ్యాపకులు వెంకటరావు, నాగేశ్వరరావు, పద్మ, శమంతక, హరణి తదితరులు పాల్గొన్నారు.


అరకులోయ గిరిజన మ్యూజియం ఆవరణలో పర్యాటక కేంద్రాల కార్యకలాపాలతో ఐటీడీఏ పీఓ అభిషేక్


మారేడుమిల్లిలో ర్యాలీ


చింతూరులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

## కూలిన వంతెన.. తప్పని యాతన!

సీలేరు, న్యూస్‌టుడే: దారకొండ పంచాయతీ గంగవరం వద్ద రాకపోకలకు వీలుగా వంతెన ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గంగవరం వద్ద వంతెన కొట్టుకుపోయింది. దీంతో గంగవరం అవతల ఉన్న సుమారు 5 గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు నిలిచిపోయాయి. వీరు ఏ చిన్న అవసరానికి అయినా దారకొండ రావాల్సిందే. కొట్టుకుపోయిన వంతెన స్థానంలో కొత్తగా నిర్మించాలని, అంతవరకూ తాత్కాలికంగా కల్వర్టు నిర్మించి రాకపోకలు పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కొట్టుకుపోయిన గంగవరం వంతెన

### రహదారిలో కూలిన భారీ వృక్షం

రంపచోడవరం, న్యూస్‌టుడే: భారీ వర్షానికి రంపచోడవరం నుంచి గోకవరం వెళ్లే ప్రధాన రహదారిలో సీతపల్లి-గోకవరం మధ్యలో భారీ వృక్షం శుక్రవారం నేలకూలింది. గంటపాటు రంపచోడవరం నుంచి గోకవరం, గోకవరం నుంచి రంపచోడవరానికి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. భారీ వర్షంతో కొండవాగులు ఉద్ధృతంగా ప్రవహించాయి. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆదేశాల మేరకు తెదేపా కార్యకర్తలతో పాటు గోపవరానికి చెందిన యువకుల సాయంతో హుటాహుటిన చెట్టును తొలగించారు. దీంతో రాకపోకలు కొనసాగాయి.


వృక్షాన్ని తొలగిస్తున్న స్థానికులు

## విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ: డీడీ


మారేడుమిల్లి కేజీబీవీ పాఠశాలలో మాట్లాడుతున్న డీడీ కొండలరావు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలకు ఆకస్మిక తనిఖీకి వచ్చిన గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు ఉపాధ్యాయుడి అవతారమెత్తారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు గణితం బోధించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకొనేందుకు వారిని కొన్ని ప్రశ్నలు అడిగారు. తరగతి గదులు, వంటశాలలను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు మిగిలిన ఉపాధ్యాయులతోనూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనారోగ్యంతో విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇళ్లకు పంపొద్దని ఆదేశించారు. ఎవరైనా విద్యార్థి వరుసగా రెండు రోజులు తరగతులకు గైర్హాజరైతే వెంటనే ఈ సమాచారాన్ని తమ కార్యాలయానికి తెలియచేయడంతో పాటు, ఆ విద్యార్థి ఇంటికి వెళ్లి తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, వార్డెన్లపై ఉందన్నారు. మారేడుమిల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలను, దస్త్రాలను పరిశీలించి, వివరాలను ప్రత్యేకాధికారిణి మయూరి లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.రామారావు దొర, వార్డెన్ సార్ల చిన్నారెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుండ్ల ఆదిరెడ్డి, పీడీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## రాయితీపై మినుము విత్తనాల పంపిణీ

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలోని త్రిపురపెంటవీడు సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వం నుంచి సొసైటీ ద్వారా రాయితీపై మినుము విత్తనాలను తెదేపా మండల అధ్యక్షులు పుట్టి రమేష్‌బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాలుగు కేజీల విత్తనాల సంచి గిరిజన రైతులకు 90శాతం, ఇతరులకు 30శాతం రాయితీపై అందించారు. అనంతరం రమేష్‌బాబు మాట్లాడుతూ రైతులకు సకాలంలో విత్తనాలు సరఫరా చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తెదేపా నేతలు బాచినేని మల్లేశ్వరరావు, దుద్దుకూరి సతీష్, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


త్రిపురపెంటవీడులో విత్తనాలు పంపిణీ చేస్తున్న తెదేపా మండల అధ్యక్షులు రమేష్‌బాబు

## నేడు, రేపు పర్యాటక ప్రాంతాల సందర్శన నిషేధం

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో ఈ నెల 28, 29 తేదీలలో పర్యాటక ప్రాంతాల సందర్శనను పూర్తిగా నిషేధించినట్లు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ పేర్కొన్నారు. శని, ఆదివారాల్లో మైదాన, పట్టణ ప్రాంతాలకు చెందిన వారు అధికంగా ఏజెన్సీలోని జలపాతాలను, కొండవాగులను సందర్శిస్తారన్నారు. ప్రస్తుతం జలపాతాలు, వాగులు ఉద్ధృతంగా ఉన్నాయని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఎవరూ రావద్దని సూచించారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తుగా ఈ హెచ్చరిక జారీ చేశామన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

## ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా కిల్లోగుడ పాఠశాల మైదానంలో ఉపాధ్యాయులకు శుక్రవారం క్రీడాపోటీలు నిర్వహించారు. సంఘ నాయకులు నగేష్ జెండా ఊపి వీటిని ప్రారంభించారు. వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, మ్యూజికల్ ఛైర్, లెమన్ అండ్ స్పూన్, క్యారమ్స్ తదితర పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, అధ్యక్షుడు రాజారావు, నాయకులు బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందుకున్న ఉపాధ్యాయులు

## వరద బాధితులకు అందుతున్న సాయం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ఇటీవల వరదల్లో ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు, జలదిగ్బంధంలో చిక్కుకున్న కుటుంబాలకు శుక్రవారం సాయంత్రం నుంచి ప్రభుత్వ సాయం అందుతోంది. బాధితుల బ్యాంకు ఖాతాల్లో రూ. 10వేలు, కొందరికి 4,800 జమవ్వడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. దీంతో వీఆర్‌పురంలో బొర్రా నరేశ్, ముత్యాల రామారావుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి శుక్రవారం వరద బాధితులు పాలాభిషేకం చేశారు. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడంలో చంద్రబాబుకు ఎవరు చాటిరారని వారు అన్నారు. వరద బాధితులు జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు.


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వరద బాధితులు

## డిగ్రీ కళాశాలలో సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి డిగ్రీ కళాశాల ఆవరణలో సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రిన్సిపల్ విజయభారతి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఈ కార్యక్రమం జరిగింది. విగ్రహదాతలు శ్రీనివాస్, జగత్‌రాయ్‌లను ప్రిన్సిపల్ అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకులు రమణ, లీలాపావని, కేజియా, రవీంద్రనాయక్, జగదీష్‌బాబు, నాగేంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠలో ప్రిన్సిపల్ తదితరులు

## పొంగిన జలధార

కూనవరం, న్యూస్‌టుడే: సహజంగా చేతిపంపు నుంచి నీరు పట్టుకోవాలంటే పంపును కొట్టాలి. కూనవరం మండలం గొమ్ముగూడెంలో రహదారి పక్కనే ఉన్న చేతిపంపు నుంచి ఎవరూ కొట్టకుండానే నీరు వస్తోంది. ఉదయం నుంచి ఏకధాటిగా నీరు వస్తుండడంతో ఆ మార్గంలో వెళ్తున్న వారంతా ఆసక్తిగా చూస్తున్నారు. వర్షాలు భారీగా కురుస్తున్నందున భూమిలోని జలం పొంగడంతో ఇలా బయటకు ఉబికి వస్తోంది.


గొమ్ముగూడెంలో చేతిపంపు నుంచి వస్తున్ననీరు

## పోషకాహారంతో ఎంతో మేలు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పోషకాహారంతో ఎంతో మేలు జరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో అచ్యుతాంబ అన్నారు. కాశీపట్నం సెక్టార్ పరిధిలోని బంగారంపేట గ్రామంలో శుక్రవారం పోషకాహారం మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రామయ్యమ్మ, సుబ్బలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: చాపరాయి జలవిహారిలో పోషకాహార మాసోత్సవాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఇక్కడ ఈ కార్యక్రమం నిర్వహించామని సీడీపీవో నీలిమ తెలిపారు. ఎంపీడీవో ఉషారాణి మాట్లాడుతూ.. పర్యాటక కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం సెక్టార్ పరిధిలోని డొంకరాయి గ్రామ సచివాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కరకా జయకుమారి, చింతల నాగమణి ఆధ్వర్యాన శుక్రవారం పోషకార మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పోషకారాలకు సంబంధించిన వంటకాలను ప్రదర్శించారు. ఎంపీటీసీ సభ్యుడు కరకా వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సంఘమిత్ర, ప్రయాంక, కో ఆర్డినేటర్ రాజు, మాజీ ఉప సర్పంచి గంగిరెడ్ల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


డొంకరాయిలో సమావేశమైన అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులు


చాపరాయి వద్ద అంగన్‌వాడీల ప్రదర్శన

## నూతన ఎస్సైల బాధ్యతల స్వీకరణ


శివనారాయణ (మోతుగూడెం) రమేష్ (చింతూరు) భూషణం (గంగవరం)

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం పోలీస్ స్టేషన్ ఎస్సైగా కె.శివనారాయణ శుక్రవారం బాధ్యతాలు స్వీకరించారు పాడేరులో వీఆర్‌లో ఉండి బదిలీపై మోతుగూడెం ఎస్సైగా వచ్చారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఎస్సై జి.గోపాలరావు బదిలీపై ఆరకు పోలీస్ స్టేషన్ ఎస్సైగా వెళ్లారు.

చింతూరు, న్యూస్‌టుడే: చింతూరు ఎస్ఐగా పేరూరి రమేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన శ్రీనివాసులును అనంతగిరి బదిలీ చేశారు.

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం ఎస్సైగా డి.భూషణం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన బి.రామకృష్ణ వై.రామవరం బదిలీపై వెళ్లనున్నారు. ఏజన్సీ ప్రాంతం నుంచి గంజాయి రవాణా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ తన వంతు సేవలను అందిస్తానన్నారు.

### ఈపీడీసీఎల్ జేఈగా పరశురాముడు



ఎటపాక, న్యూస్‌టుడే: ఈపీడీసీఎల్ మండల జేఈగా టి.పరశురాముడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కూనవరం మండలంలో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఎటపాక మండలానికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన రాజ్‌కపూర్ బదిలీపై కూనవరం వెళ్లినట్లు సమాచారం. ఈ సందర్భంగా పరశురాముడు మాట్లాడుతూప్రజల సహకారంతో విద్యుత్తు సరఫరాలో ఎటువంటి లోటుపాట్లు జరుగకుండా పనిచేస్తానని తెలిపారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే

?: స్థానిక పీఎంఆర్‌సీ-వైటీసీ మార్గం మధ్యలో ప్రధాన రహదారిలో పెద్ద గుంతలు పడ్డాయి. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. – సిద్ధా వెంకన్నదొర, రంపచోడవరం

✔: ఇటీవల కురిసిన వర్షాలతో రహదారులు గుంతలుపడ్డాయి. వీటికి త్వరలో మరమ్మతులు చేపడతాం. – సాయిసతీష్, డీఈ, ర.భ.శాఖ, రంపచోడవరం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే

?: మారేడుమిల్లి నుంచి గుజ్జుమామిడివలస వెళ్లే రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతోపాటు, ఇరుకు రోడ్లపై పశువులు ఉంటుండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. – పండు, జీఎంవలస

✔: ఈ దారికి ఇరువైపులా ఉన్న తుప్పలు తొలగించే విధంగా చర్యలు చేపడతాం. రహదారిపై పశువుల సంచారాన్ని నివారించడానికి చర్యలు తీసుకుంటాం. – విజయ్‌కుమార్, ఈవోపీఆర్డీ, మారేడుమిల్లి



## రహదారుల బాగుకు చర్యలు

సీలేరు, న్యూస్‌టుడే: ఈనెల 8న కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులను గ్రామస్థులే శ్రమదానంతో బాగు చేసుకుంటున్నారు. ధారకొండ పంచాయతీ డి.అగ్రహారం నుంచి కొంగపాకలకు వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. రెండు గ్రామాలకు చెందిన గిరిజనులు శుక్రవారం శ్రమదానంతో రోడ్డును బాగు చేసుకున్నారు. కొట్టుకుపోయిన కల్వర్టుల వద్ద రాళ్లు వేశారు.

★ దార్లగొంది నుంచి మునసలవీధికి వెళ్లే రహదారి పూర్తిగా కొట్టుకుపోయి రాకపోకలు స్తంభించాయి. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ దృష్టికి స్థానిక సర్పంచి నడిగొట్ల రాజు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. తక్షణమే మరమ్మతులు చేసి వాహనాలు వెళ్లేలా చూడాలని సర్పంచికి పీవో సూచించడంతో శుక్రవారం పనులు ప్రారంభించారు. రెండో రోజుల్లో పనులు పూర్తవుతాయని సర్పంచి రాజు తెలిపారు.


మునసలవీధి రహదారికి మరమ్మతు

## కార్మికుల సమస్యలపై చలో కలెక్టరేట్ 30న

చింతపల్లి, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలపై ఈనెల 30న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో శాశ్వత పనులన్నింటినీ శాశ్వత కార్మికులను నియమించాలన్నారు. శుక్రవారం చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం కార్మికులతో మాట్లాడారు. వారికి సీఐటీయూ ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు, కొర్రా నాగేశ్వరరావు, రాజేశ్వరి, అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జీసీసీ హమాలీల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి.పండుబాబు కోరారు. జి.మాడుగుల జీసీసీ గోదాము వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. దసరా బోనస్, ఏకరూప దుస్తులు, కుట్టుధరలు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. బాబూరావు, శ్రీనుబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

కూనవరం,న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వాలంటీర్లు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సంఘం మండల శాఖ అధ్యక్షుడు కొమరం పెంటయ్య మాట్లాడుతూ వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతన బకాయిలు విడుదల చేయాలని, రాజీనామా చేసిన వారిని తీసుకోవాలని కోరారు. ముందుగా కోతులగుట్టలో ర్యాలీ నిర్వహించారు. చిచ్చుడి మహేశ్, పద్మ, రవి, వాలంటీర్లు పాల్గొన్నారు.


కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్